## క్లుప్తంగా

### నేడు కరెంట్ కోత

ఖమ్మంఅర్బన్: నగరంలోని బాలపేట ఫీడర్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బల్లేపల్లి సెక్షన్ ఏఈ భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఫీడర్ పరిధిలోని జయనగర్‌కాలనీ, బల్లేపల్లి, బాలపేట, బాలపేటతండా, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

### దరఖాస్తు చేసుకోండి

ఖమ్మంక్రైం: పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించబడుచున్న కృష్ణ ప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో కంప్యూటర్ బోధించుటకు, ఆఫీస్ వర్క్ చేయడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల చైర్‌పర్సన్ హృదయ మీనన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైమరీ స్కూల్ మొదటి తరగతి నుంచి ఐదో తరగతి వరకు, హైస్కూల్‌లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు కంప్యూటర్ సబ్జెక్ట్ బోధించాలన్నారు. ఈనెల 7లోగా దరఖాస్తులు పంపాలని, వివరాలకు 94405 25093 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

### 'రైతుబీమా'కు..

ఖమ్మంరూరల్: ఈ నెల 5 వరకు రైతు బీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏఓ వి.నాగేశ్వరావు తెలిపారు. బుధవారం మండలంలోని ముత్తగూడెం, మంగళగూడెంలలోని రైతువేదికల్లో పథకానికి సంబంధించి రైతులకు ఆన్‌లైన్ చేయించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన రైతులు దరఖాస్తుతో పాటు భూమి పాస్‌బుక్, ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డులను తీసుకొని ఏఈలను సంప్రదించాలని తెలిపారు.

### క్రీడాభివృద్ధికి కృషి చేసిన పరంధామరెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లాలో క్రీడల సమగ్రాభివృద్ధికి డీవైఎస్‌ఓగా ఎం.పరంధామరెడ్డి విశేష కృషి చేశారని పలువురు కొనియాడారు. ఇటీవల భద్రాద్రి డీవైఎస్‌ఓగా బదిలీ అయిన ఆయనను నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో గురువారం సన్మానించారు. ప్రస్తుత డీవైఎస్‌ఓ సునీల్‌కుమార్‌రెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, అక్బర్ అలీ, డాక్టర్ సత్యనారాయణ, జక్కుల వెంకటరమణతో పాటు అసోసియేషన్ బాధ్యులు పాల్గొన్నారు.

### 5 నుంచి 10వ తేదీ వరకు ఇజ్రాయిల్ టూర్

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ రంగ అధ్యయనం కోసం ఈ నెల 5 నుంచి 10వ తేదీ వరకు ప్రభుత్వం ఇజ్రాయిల్ టూర్ నిర్వహిస్తున్నట్లు టూర్‌కు ఎంపికైన జిల్లా రైతుబంధు కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టూర్‌లో రాష్ట్రం నుంచి 30 మంది రైతు ప్రతినిధులు, అధికారులు ఉన్నారని తనతో పాటు ఖమ్మం జిల్లా నుంచి జిల్లా వ్యవసాయాధికారిణి ఎం.విజయనిర్మల కూడా ఉన్నారని తెలిపారు.

### పంచాయితీకి పిలిచి బైక్‌లు లాక్కున్నారు..

నేలకొండపల్లి: ఓ విషయమై పంచాయితీకి పిలిచిన ఇరువురి బైక్‌లు లాక్కున్న ఘటనపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని పైనంపల్లికి చెందిన కుక్కల సామేలును కొందరు డబ్బు చెల్లింపు విషయమై పంచాయితీకి పిలిచారు. దీంతో ఆయన కె.ఆదాంతో కలిసి రాగా, గొడవ జరిగింది. అయితే, డబ్బు చెల్లించే వరకు బైక్‌లు ఇచ్చేది లేదని ఇద్దరి వాహనాలు లాక్కోవడంతో సామేలు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

### గణిత అధ్యాపకుడు మృతి



శ్రీనివాస్ (ఫైల్)

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని ప్రముఖ గణిత అధ్యాపకుడు ఆకెళ్ళ శ్రీనివాస్(50) బుధవారం ఆకస్మికంగా మృతి చెందాడు. వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన శ్రీనివాస్ మృతి పట్ల ఆర్‌జేసీ, ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ, పలు ప్రైవేట్ విద్యాసంస్థల బాధ్యులు, అధ్యాపకులు సంతాపం ప్రకటించారు.

### పలువురికి పరామర్శ

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు, బచ్చోడుతండా, ఇస్లావత్‌తండాలలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తోట నర్సయ్య, గుగులోతు వీరన్న, భూక్యా బాల్యా గన్నా నాయక్ కుటుంబాలను టీపీసీసీ సభ్యుడు రాయల నాగేశ్వరరావు బుధవారం పరామర్శించి మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాప్యా నాయక్, ఉన్నం రాజశేఖర్, చుంచు వెంకన్న, నాగరాజు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల ప్రదర్శన

తిరుమలాయపాలెం: నేడు నిర్వహించే జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని మండలంలోని జల్లెపల్లి జిల్లా పరిషత్ విద్యార్థులు నేషనల్ డీవార్మింగ్(ఎన్‌డీడీ) నమూనాలో కూర్చుని ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శైలజ, ఏఎన్‌ఎం నాగమణి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నాలుగేళ్లుగా నరకం..!



వెంకటేశ్వరనగర్‌లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్



ఆస్పత్రిని శుభ్రం చేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)



పాడైపోయిన మందులను తరలిస్తున్న మున్సిపల్ సిబ్బంది(ఫైల్)

**వెంకటేశ్వరనగర్ యూపీహెచ్‌సీలో సమస్యల తిష్ట**

- ఇంకా అద్దె భవనంలోనే కొనసాగుతున్న వైద్య సేవలు
- మున్నేరు వరదలకు పాడైపోయిన మందులు, సామగ్రి
- అరకొర వసతులతో ఇబ్బంది పడుతున్న సిబ్బంది, బాధితులు
- కాంట్రాక్ట్ గడువు తీరడంతో తప్పని తిప్పలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలోని వెంకటేశ్వరనగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్(యూపీహెచ్‌సీ) గత నాలుగేళ్లుగా పలు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ప్రభుత్వ భవనం లేకపోవటంతో అద్దె భవనంలోనే వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. అరకొర వసతుల నడుమ ఇటు వైద్యులు, సిబ్బందితో పాటు అటు రోగులు కూడా నానా ఇబ్బందులు పడుతున్నారు. అద్దె భవనం కావటం, కాంట్రాక్ట్ కూడా తీరడంతో యజమాని నుంచి ఖాళీ చేయాలనే హెచ్చరికలు తరచూ ఎదురవుతున్నాయి. శాశ్వత భవనం కల ఎప్పుడు తీరుతుందోనని ఆస్పత్రి సిబ్బంది ఎదురు చూస్తున్నారు. సౌకర్యాలు కూడా అంతంత మాత్రమే.

**వరదతో కోలుకోలేని దెబ్బ..**

ఇటీవల వచ్చిన వర్షాలు యూపీహెచ్‌సీని కోలుకోలేని దెబ్బ తీశాయి. గత నెల 27వ తేదీన ఆస్పత్రి మొత్తం మోకాళ్ల లోతు వరకు వరద నిండడంతో సిబ్బంది నానా పాట్లు పడ్డారు. ఆస్పత్రిలోని సామగ్రి, మందులు పూర్తిగా మునిగిపోయి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. అంతేకాక బురద మేటలు వేయడంతో శుభ్రం చేసేందుకు సిబ్బందికి రెండు రోజుల సమయం పట్టింది. దీంతో వైద్య సేవలకు మూడు, నాలుగు రోజుల పాటు ఆటంకం కలిగింది.

**వేధిస్తున్న సిబ్బంది కొరత..**

యూపీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌తో పాటు ఇద్దరు చొప్పున సూపర్‌వైజర్లు, సపోర్టింగ్ స్టాఫ్, నలుగురు ఏఎన్‌ఎంలు, నైట్ వాచ్‌మెన్, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్ట్ ఒక్కొక్కరు చొప్పున పనిచేస్తున్నారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొనసాగుతున్న ఆస్పత్రి.. రాత్రి 8 గంటల వరకు కూడా వైద్య సేవలు అందిస్తున్నారు. కాగా, ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు, మందులు, తదితర వివరాలు నమోదు చేయాల్సి వచ్చినప్పుడు డేటా ఎంట్రీ ఆపరేటర్ లేకపోవటంతో ఆస్పత్రిలోని సిబ్బందే చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంకటేశ్వర్‌నగర్ ఆస్పత్రి పరిధిలో బొక్కలగడ్డ, మంచికంటినగర్, నిజాంపేట, ఖిల్లా, బ్యాంక్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, జూబ్లీపుర ప్రాంతాల నుంచే కాకుండా మోతేనగర్, దానవాయిగూడెం, పద్మావతినగర్ ప్రాంతాల నుంచి కూడా వైద్య సేవల నిమిత్తం బాధితులు వస్తుండడంతో నిత్యం 70కి పైగా ఓపీలు చూడాల్సి వస్తుంది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన ఆస్పత్రికి శాశ్వత భవనం లేకపోవటం ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

**తీరిన కాంట్రాక్ట్ గడువు..**

గత ఏడాది సెప్టెంబర్‌లోనే కాంట్రాక్ట్ గడువు తీరిపోవటంతో ఇంటి యజమాని ఖాళీ చేయాలని ఒత్తిడి తెస్తున్నాడు. కాగా, ఈ ఆస్పత్రి నిర్వహణ కోసం పాత డీపీఆర్‌ఓ కార్యాలయాన్ని కలెక్టర్ కేటాయించగా.. అక్కడ నూతన భవనం నిర్మించాలని నిర్ణయించారు. కానీ దాని నిర్మాణానికి ఎన్నేళ్లు పడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అప్పటి వరకు తిప్పలు తప్పేలా లేవు.

**సామగ్రి అంతా తడిసిపోయింది..**



గత వారం వచ్చిన వరదతో ఆస్పత్రిలోని సామగ్రి పూర్తిగా తడిసిపోయింది. మోటర్ పాడైపోయింది. ముందు జాగ్రత్తగా మందులు, వ్యాక్సిన్లు భద్రపరిచాం. అయినా 20 శాతానికి పైగా మందులు తడిసిపోయాయి. వాటిని డంపింగ్‌యార్డ్‌కు తరలించాం. వరద తాకిడికి బురద మేటలు వేయడంతో సిబ్బందితో కలిసి శుభ్రం చేయించాం. ప్రస్తుతం యథావిధిగా సేవలు కొనసాగుతున్నాయి. ఆస్పత్రి భవనం కాంట్రాక్ట్ తీరిపోయింది. తిరిగి కొనసాగించాల్సి ఉంది.

– పవన్, ఆస్పత్రి వైద్యుడు

# ప్రమాద రహిత సమాజమే లక్ష్యం



లెర్నింగ్ లైసెన్స్ పంపిణీ చేస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: ప్రమాద రహిత సమాజాన్ని నిర్మించాలనే లక్ష్యంతో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ చేపట్టిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతోందని మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. బుధవారం వీడీవోస్ కాలనీలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఎల్‌ఎల్‌ఆర్‌లను మేయర్‌తోపాటు ఆర్టీఓ కిషన్ రావు, జిల్లా ఆర్టీఏ మెంబర్ వల్లభనేని రామారావు, సుడా చైర్మన్ విజయ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి పౌరుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం అభివృద్ధి కోసం మంత్రి పువ్వాడ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దొరేపల్లి శ్వేత, దండా జ్యోతిరెడ్డి, ఎస్‌కె. మక్బూల్, నాయకులు కన్నం ప్రసన్న కృష్ణ, తోట వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే హర్యాన, మణిపూర్‌లలో అల్లర్లు జరుగుతున్నాయని తంజీ మే ఇన్సాఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం ఆరోపించారు. బుధవారం తంజీ మే ఇన్సాఫ్ ఆధ్వర్యాన స్థానిక ఇండస్ట్రీ రోడ్డులో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయ లబ్ధి కోసం బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్‌లు ఒక ప్రణాళిక ప్రకారం ఘర్షణలు సృష్టిస్తున్నారని, మైనార్టీలపై దాడులు, వారి షాపులను తగలపెట్టడం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడ్డి, ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.సైదా, నిజాంపేట్ యాకూబ్, ఎండీ. రెహ్మాన్, ఎండీ అష్రఫ్‌తో పాటు కరీం, రహమాన్, షఫి తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతలు స్వీకరణ..

**టూటౌన్ సీఐగా కుమారస్వామి..**



బాధ్యతలు స్వీకరిస్తున్న కుమారస్వామి

ఖమ్మంక్రైం: ఖమ్మం టూటౌన్ సీఐగా కె.కుమారస్వామి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన రవికుమార్ ఆకస్మికంగా బదిలీ కావడంతో వరంగల్ వీఆర్‌లో ఉన్న ఆయనను ఖమ్మం టూటౌన్ సీఐగా బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు బాధ్యతలు స్వీకరించారు.

**రఘునాథపాలెం ఎస్‌ఐగా కొండలరావు..**



బాధ్యతలు స్వీకరిస్తున్న కొండలరావు

రఘునాథపాలెం: రఘునాథపాలెం ఎస్‌ఐగా బి.కొండలరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎస్‌ఐగా ఉన్న మాచినేని రవి కొత్తగూడెం జిల్లా చండుకొండ ఎస్‌ఐగా బదిలీ కాగా ఆయన స్థానంలో ఖమ్మంలో వీఆర్‌లో ఉన్న కొండలరావును తాత్కాలిక అటాచ్‌మెంట్ చేస్తూ సీపీ విష్ణు వారియర్ ఇచ్చిన ఆదేశాల మేరకు బాధ్యతలు స్వీకరించారు. కాగా, పలువురు ఎస్‌ఐను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

**కూసుమంచి తహసీల్దార్‌గా సంపత్‌కుమార్..**



బాధ్యతలు చేపట్టిన సంపత్‌కుమార్

కూసుమంచి: కూసుమంచి తహసీల్దార్‌గా ఎస్. సంపత్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ వీవీ శకుంతల భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ కాగా వరంగల్ నుంచి సంపత్‌కుమార్ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

## ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ ఎన్నిక

ఖమ్మంరూరల్: రూరల్ మండల ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ ఎన్నిక బుధవారం మండలంలోని రెడ్డిపల్లిలో నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా మల్లెల వీరన్న, ప్రధాన కార్యదర్శి తొర్రికొండ రవి, కోశాధికారి శ్యాం, గౌరవాధ్యక్షులుగా పి. రమేష్‌బాబు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కె.హుస్సేన్ మాట్లాడుతూ.. ఫొటోగ్రాఫర్లకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పేర్కొన్నారు. నాయకులు శ్రీనివాసరెడ్డి, సంగయ్య, లక్ష్మణ్, రామారావు, రఘు, శశి, నాగి, గణేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న అధ్యాపక బృందం

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ(సెకండియర్) విద్యార్థులు ఎల్.తరుణ్, ఆర్.వినయ్ ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు సాధించినందుకు కళాశాల ప్రిన్సిపాల్ బి.విద్యాసాగర్, అధ్యాపక బృందం బుధవారం ఘనంగా సన్మానించింది. కాగా, తరుణ్ ఎస్‌బీటీ జలందర్‌లో సీఎస్‌ఈ విభాగంలో, వినయ్ ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఈసీఈ విభాగంలో సీట్లు సాధించారు.

## నియామకం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ ముస్లిం సంఘాల జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్‌గా మహమ్మద్ జమీల్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర కన్వీనర్ సలీం పాషా నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా జమీల్ మాట్లాడుతూ.. తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలుపుతూ జిల్లాతో పాటు నియోజకవర్గాల కమిటీలను ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

## ఆర్థిక సాయం

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు కుటుంబాలకు పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి అందజేస్తున్న ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే కుమార్తె దీప్తి బుధవారం పంపిణీ చేశారు. అదే విధంగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వపాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## జనసేన కమిటీ ఎన్నిక

ఖమ్మం మామిళ్లగూడెం: జనసేన 49వ డివిజన్ కమిటీని ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ మిరియాల రామకృష్ణ ఒక ప్రకటనలో వెల్లడించారు.ఈ మేరకు అధ్యక్షుడిగా పి.ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా చింతలచెరువు వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సాయికిరణ్, వరుణ్, కార్యదర్శులుగా రాజేష్, ఉదయ్, వెంకటసాయి, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా కల్యాణ్, సాయి, సుశాంత్, మౌలాలిలను నియమించినట్లు ఆయన తెలిపారు.

## అక్రమ భవన నిర్మాణానికి నోటీసులు..

నేలకొండపల్లి: మండలంలోని రాజేశ్వరపురం గ్రామ పంచాయతీలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా అక్రమంగా భవన నిర్మాణం చేస్తున్న ఓ యజమానికి మే 23న నోటీసులు జారీ చేశారు. దీంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు. కాగా, బుధవారం భవన నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించటంతో పంచాయతీ కార్యదర్శి చిరంజీవి యజమానికి రెండో నోటీసు జారీ చేసి పనులు నిలిపివేశారు. నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంచాయతీ నుంచి అనుమతులు పొందిన తరువాతే నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు.

# పశు సంపదతో ఆర్థికంగా ఎదగాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ రమ్య

నేలకొండపల్లి: పశు సంపదతో రైతులు ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ వజ్జా రమ్య సూచించారు. బుధవారం మండలంలోని రాజేశ్వరపురంలో ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. పశువులకు సీజనల్ వ్యాధులు రాకుండా పశు వైద్యాధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఉచిత నట్టల నివారణ మందును పంపిణీ చేశారు. ఈ మేరకు మండల పశువైద్యాధికారి సంజయ్‌రెడ్డి రైతులకు పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రమ్మ, ఉప సర్పంచ్ చిట్యాల రమేష్, టి.మురళీ, గోపాలమిత్రలు నరేష్, తాజ్, పాండు, విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 'తొలి మెట్టు'ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఎంఈఓ రాములు

నేలకొండపల్లి: తొలి మెట్టు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నేలకొండపల్లి మండల విద్యాశాఖాధికారి బి.రాములు సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న ఉపాధ్యాయులు తరగతి గదుల్లో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. మూడు విడతలుగా నిర్వహించే ఈ కార్యక్రమం ఈ నెల 8 ముగుస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ అబ్రహం, రిసోర్స్ పర్సన్లు ఆనందరావు, రామారావు, సీఆర్‌పీలు ప్రసాద్, వెంకటేశ్వర్లు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జావా ఫౌండేషన్ శిక్షణ ప్రారంభం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో టాస్క్ సౌజన్యంతో ఒరాకిల్ అకాడమీ ఆధ్వర్యాన తొమ్మిది రోజుల పాటు జావా ఫౌండేషన్ సర్టిఫికెట్ ప్రోగ్రాం ప్రారంభమైనట్లు కళాశాల చైర్మన్ జి.కృష్ణ తెలిపారు. 195 మంది సీఎస్‌సీ ద్వితీయ సంవత్సరానికి చెందిన విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శివప్రసాద్, ప్రవీణ్‌కుమార్, సుభాష్ చందర్, రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

## 'సర్వజ్ఞ'లో మాన్‌సూన్ డే

ఖమ్మం సహకారనగర్: నగరంలోని వీడీవోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో బుధవారం మాన్‌సూన్ డే ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ నీలిమ తెలిపారు. వర్షం కురుస్తుంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు వర్షాలకు సంబంధించిన గేయాలు ఆలపించి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రమ దోపిడీకి గురవుతున్న కేజీబీవీ ఉద్యోగులు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

ఖమ్మంఅర్బన్,రఘునాథపాలెం: రాష్ట్రవ్యాప్తంగా కస్తూర్బా, యూఆర్‌ఎస్, మోడల్ స్కూళ్లలో పనిచేస్తున్న నాన్ టీచింగ్ అండ్ వర్కర్లకు తెలంగాణ ప్రభుత్వం కనీస వేతనాలను నిర్ణయించాలని భారత కార్మిక సంఘాల సమైక్య(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు ఆవుల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రఘునాథపాలెంలోని కేజీబీవీ, నగరంలోని వెలుగుమట్లలో గల కేజీబీవీ పాఠశాలల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏళ్ల తరబడి తక్కువ వేతనంలో అత్యధిక పని గంటలు పని చేస్తూ ఉద్యోగులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, కేవలం రూ. 9వేలు ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన ఏ ఒక్క హామీ నెరవేర్చడంలేదని, రాబోయే పీఆర్‌సీ కంటే ముందే కేజీబీవీ యూఆర్‌ఎస్ మోడల్ స్కూల్ కనీస వేతనం రూ.19వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.ఈమేరకు ఆగస్టు 4న చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఐఎఫ్‌టీయూ పిలుపు నిచ్చిందని పేర్కొంటూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల కస్తూర్బా నాన్ టీచింగ్, వర్కర్స్ యూనియన్ నాయకురాలు జ్యోతి, సుశీల కుమారి, నాగలక్ష్మి, శిరీష, ఋక, శైలజ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## సైడ్ డ్రెయిన్ పనులకు శంకుస్థాపన

తిరుమలాయపాలెం: మండలంలోని జోగులపాడులో రూ.8 లక్షల జెడ్పీటీసీ నిధులతో చేపడుతున్న సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు బుధవారం జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నల్లబెల్లి లింగన్న ఉపసర్పంచ్ వెంకన్న, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు వితరణ



వితరణ చేశాక చిన్నారులతో విద్యార్థి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 6వ డివిజన్ రస్తోగినగర్ పాఠశాలలో వంకాయలపాటి సాయి వెంకట్‌సాత్విక్ అనే విద్యార్థి (బీటెక్ గోల్డ్‌మెడలిస్ట్) పేద విద్యార్థులను విద్యాపరంగా ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బుధవారం నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ నాగండ్లకోటి, విద్యార్థి తండ్రి వంకాయలపాటి సాంబశివరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పాలాభిషేకం..

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఖమ్మం డిపోలో సంబరాలు చేసుకున్నారు. ఈమేరకు సీఎం కేసీఆర్, మంత్రి అజయ్‌కుమార్ ఫ్లెక్సీలకు డీఎం శ్రీనివాస్‌తో పాటు సీఐ రామయ్య పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌నాథ్, భుజంగరావు, కోటయ్య, గ్యారేజీ సిబ్బంది, ఎంఎఫ్ ఏడీసీలు ఏఎస్‌రావు రఘుపతి పాల్గొన్నారు.

## గురుకులం సందర్శన

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం గురుకుల బాలికల పాఠశాలను పీడీఎస్‌యూ బృందం బుధవారం సందర్శించింది. ఈమేరకు గురుకుల ఆవరణాన్ని పరిశీలించాక విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ.. వర్షాలు పడితే గురుకులం అంతా చెరువులను తలపించేలా ఉందని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని, ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటి సభ్యులు సాగర్, పాలేరు డివిజన్ కమిటి సభ్యులు గోపి, వేణు, అర్జున్ పాల్గొన్నారు.

# సచివాలయ ముట్టడిని జయప్రదం చేయండి




సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

ఖమ్మం మామిళ్లగూడెం: రెండో ఏఎన్‌ఎంల నోటిఫికేషన్ రద్దు చేసి బేషరతుగా రెగ్యులర్ చేయాలని డిమాండ్‌తో ఈ నెల 4న నిర్వహించే సచివాలయ ముట్టడికి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు తోట రామాంజనేయులు పిలుపునిచ్చారు. బుధవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఖమ్మం జిల్లాస్థాయి పీహెచ్‌సీ లీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. హరీష్‌రావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆరోగ్య శాఖలో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోవటం బాధాకరమని వెంటనే డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో హేమలత, అంబటి శైలజ, రాజేశ్వరి, నాగరాణి, దయమణి, పద్మావతి, గోప్పమ్మ తదితరులు పాల్గొన్నారు.

**కార్మిక గర్జన సభను..**

అసంఘటిత కార్మికులకు కార్మిక చట్టాలు అమలుచేయాలని డిమాండ్‌తో ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగే కార్మిక గర్జనసభను జయప్రదం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య కోరారు. బుధవారం అధ్యక్షుడు గౌస్ అధ్యక్షతన జరిగిన టైల్స్ రంగ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు శ్రీనివాస్, వెంకన్న, హల్తాఫ్, నాగరాజు, యాకుబ్, షరీఫ్, హైమద్, సలీం, జలీల్, శ్రీనివాస్, అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.